నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, ఆదివారం 21 జనవరి 2024 | SANGAREDDY

ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

అభివృద్ధిపై దృష్టి సారించాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి

గ్రామాల్లో రోడ్లు, కరెంట్ సమస్యల పరిష్కారానికి కృషి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలిపిచెడ్, జనవరి 20: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం చిలిపిచెడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023-24కి అధికారుల సహకారంతో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. చిలిపిచెడ్‌లో కరెంట్ తారువైరు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు చెప్పినా ఏఈ పట్టించుకోవడంలేని సర్పంచ్ లక్ష్మీదుర్గారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఏఈ రాంబాబుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు. కరెంట్ 24 గంటలు వస్తుందా? మండలంలో ఎన్ని సబ్‌స్టేషన్లు ఉన్నాయి? అని ఏఈ రాంబాబును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. త్వరంలో గంగారం నుంచి ఫైజాబాద్ బీటీ రోడ్డు పనులు చేపట్టాలని పీఆర్ ఏఈ మధుబాబును ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో శశిప్రభ, ఎంపీవో, ఆయా గ్రామాల సర్పంచులు గోపాల్‌రెడ్డి, పరశురాంరెడ్డి, శంకర్‌నాయక్, యాదగిరి, రాకేశ్‌నాయక్, కవిత, మనోహర, ఇస్తారి, ఎంపీటీసీలు మల్లయ్య, మల్లమ్మ, సుభాష్‌రెడ్డి, ఏపీవో శ్యామ్‌కుమార్, ఏపీఎం ప్రేమలత పాల్గొన్నారు.

బీఎల్‌వోలు బాధ్యతగా ఓటరు నమోదును పూర్తి చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

తారా డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి, జనవరి 20: ఎన్నికల సంఘం కొత్త ఓటర్ల నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిందని, బీఎల్‌వోలు సమయపాలన పాటించి విధులకు రావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల నిర్వహణ తీరుతెన్నులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్‌వోలు బాధ్యతగా పని చేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని, అర్హులైన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకుని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్రారెడ్డి, తహసీల్దార్ ఫర్వీన్ షేక్, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

జహీరాబాద్, జనవరి 20: అర్హులైన ప్రతిఒకరూ ఓటరు జాబితలో పేర్లు నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

బొల్లారం, జనవరి 20: జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ప్రకటనలో తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

హత్నూర, జనవరి 20: హత్నూర మండలంలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను శనివారం నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించారు. హత్నూర, దౌల్తాబాద్, సాదుల్లానగర్ గ్రామాల్లో బీఎల్‌వోలు చేపడుతున్న ఓటరు నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు కావాలి

కల్హేర్, జనవరి 20: 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు కావాలని, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌వోలు సక్రమంగా నిర్వహించాలని నారాయణఖేడ్ ఆర్డీవో వెంకటేశ్ అన్నారు. శనివారం మండలపరిధిలోని కృష్ణాపూర్‌లోని 34,35 పోలింగ్ కేంద్రాలల్లో ఓటర్ల నమోదు పక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలశంకర్, సర్పంచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్, బీఎల్‌వోలు, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

ప్రియుడితో కలిసి భర్తను హత్యచేయించిన భార్య

జోగిపేటలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ రమేశ్‌కుమార్

జోగిపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేశ్‌కుమార్

మృతుడు మల్లేశం (ఫైల్)

అందోల్, జనవరి 20 : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను భార్య హత్య చేయించిన సంఘటన జోగిపేటలో కలకలం రేపింది. మృతుడు శుక్రవారం ఉదయం జోగిపేటలో కిడ్నాప్ కాగా శనివారం ఉదయం మెదక్ జిల్లాలో రామాయంపేట్‌లో పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. దర్యాప్తు చేపట్టి భార్యను, ఆమెకు సహకరించిన మరో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్ శనివారం జోగిపేట ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. జోగిపేటకు చెందిన పాపన్నపేట మల్లేశం (35) పట్టణంలో లాండ్రీ షాప్ నిర్వహిస్తున్నాడు. మండలంలోని మన్సాన్‌పల్లికి చెందిన కల్పనతో మల్లేశానికి 2015లో వివాహం జరిగింది. పెండ్లికి ముందే కల్పనకు అదే గ్రామానికి చెందిన మచ్చురి మహేశ్‌తో పరిచయమున్నది. పెండ్లి తర్వాత కూడా ఇద్దరు చనువుగా ఉండడంతో పలుమార్లు భార్య, భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో, ప్రియురాలి భర్త అడ్డు తొలిగించుకోవాలని ప్లాన్ వేసిన మచ్చురి మహేశ్ వరుసకు మేనమామ అయినా రంగంపేట్‌కు చెందిన ఉసికే అంబాజీకి విషయం చెప్పి సహాయం కోరాడు. అందుకోసం అదే గ్రామానికి చెందిన తలారి మహేశ్‌కు రూ. 50వేలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుని, గంగారం గ్రామానికి చెందిన వజ్జెరి మహేశ్‌తో కలిసి హత్యకు ప్లాన్ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఓ కారును అద్దెకు తీసుకుని ఉదయం 5:30 సమయంలో జోగిపేటలోని మల్లేశం ఇంటి వద్ద కాపుకాసి అతడు బయటకు రాగానే దాడిచేసి కారులో తీసుకు వెళ్లారు. మార్గమధ్యలో అతడిని హత్యచేసి మెదక్ జిల్లా రామాయంపేట్ శివారులోని చెరువు వద్ద మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసిన పోలీసులు జోగిపేటలో మల్లేశం కిడ్నాప్‌నకు గురైన స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పదంగా ఉండడంతో భార్యను అదుపులోకి తీసుకుని విచారించడంతో ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసినట్లు అంగీకరించింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు హత్యకు కారణమైన ప్రియుడు మచ్చురి మహేశ్, తలారి మహేశ్, వజ్జెరి మహేశ్, ఉసికే అంబాజీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్సైలు అరుణ్‌కుమార్‌గౌడ్, కోటేశ్వర్‌రావు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు..

మోగిన గంట

సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- సిద్దిపేట జిల్లాలో 1054 పాఠశాలలు
- ఈ నెల 29న ఎన్నికలు.. చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

సిద్దిపేట అర్బన్, జనవరి 20: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) పాత్ర కీలకమైంది. ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులతో ఏర్పాటు చేసే ఈ కమిటీల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేయనున్నారు. సిద్దిపేట జిల్లాలోని 638 ప్రాథమిక, 115 ప్రాథమికోన్నత పాఠశాలలు, 227 ఉన్నత పాఠశాలలు, 14 మోడల్ స్కూళ్లు, 22 కేజీబీవీలు, 36 రెసిడెన్షియల్ పాఠశాలలు, 2 ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలకు ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 1054 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

ఈ నెల 29న జరుగనున్న ఎన్నికలు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఓటరు జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ఈ నెల 22 నుంచి 23వ తేదీ వరకు తల్లిదండ్రుల ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ నెల 24న తుది ఓటరు జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తారు. ఈ నెల 29వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించి మధ్యాహ్నం 1.30 గంటలకు కొత్త చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. అదే రోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్లతో సమావేశం నిర్వహిస్తారు.

కమిటీ ఎన్నిక జరిగే విధానం

ఎన్నిక జరిగే రోజు 50 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుంది. చేతులెత్తే పద్ధతి లేదా వాయిస్ ఓటు ద్వారా ఎన్నికలు నిర్వహిస్తారు. చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. ఇందులో ప్రతి ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండాలి. వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులుగా, ఇద్దరు కోఆప్టేడ్ సభ్యులు ఉంటారు. ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అయితే ప్రతి పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే సభ్యులుగా ఉంటారు. 9,10వ తరగతుల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ కమిటీల్లో అవకాశం కల్పించరు. ఎన్నికైన కమిటీ రెండేండ్ల పాటు పదవిలో ఉంటుంది.

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న జాతరకు తరలివస్తున్న భక్తులు

మమ్మేలు మల్లన్న

నేడు కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో పట్నం వారం

భారీగా వచ్చిన భక్తులు..

హైదరాబాద్ భక్తుల సందడి

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం : సిద్దిపేట సీపీ అనురాధ

ఆలయ పరిసరాలు, దర్శన ప్రదేశాల పరిశీలన

చేర్యాల, జనవరి 20 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఆదివారం(నేడు) పట్నంవారం నిర్వహిస్తారు. ఇప్పటికే హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా ఆలయానికి వచ్చారు. ఆలయ గదులతో పాటు ప్రైవేట్ గదులు భక్తులతో నిండిపోయాయి. గదులు దొరక్క కొందరు భక్తులు వారు వచ్చిన వాహనాల్లోనే సేదతీరుతున్నారు. మరికొందరు భక్తులు క్షేత్రంలోని ఖాళీ ప్రదేశాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని సామగ్రిని భద్రపర్చుకున్నారు. ఆదివారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం మొక్కులు చెల్లించుకుంటారు. తిరిగి సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత కొండపోచమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్ర పరిసరాలు, దర్శన ప్రదేశాలు, వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్‌ను శనివారం ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి అసాంఘిక ఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేస్తూ పార్కింగ్ ప్రదేశాలకు పంపించాలని సిబ్బందికి సీపీ సూచించారు. రెండు సెక్టార్లుగా బందోబస్తు విభజించినట్లు తెలిపారు. తోటబావి సమీపంలో ఎడమవైపు ఉన్న కాంపౌండ్ వాల్ ప్రదేశంలో వీఐపీ పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేట, చేర్యాల, కిష్టంపేట, కొమురవెల్లి కమాన్ నుంచి వచ్చే వాహనదారులు బస్టాండ్ పక్కన్న ఉన్న ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. హైదరాబాద్, కొండపోచమ్మ టెంపుల్, ఐనాపూర్ గ్రామం నుంచి వచ్చే వాహనదారులు కొమురవెల్లి పెట్రోల్ పంపు వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం సీపీ కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఫర్నిచర్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఆమె వెంట అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాస్ రావు, ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాశ్‌చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, ఎస్‌బీ ఏసీపీ రవీందర్‌రాజు, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు, సీఐలు,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నూతనంగా నిర్మించిన కొమురవెల్లి పీఎస్‌ను సందర్శించిన సిద్దిపేట సీసీ అనురాధ

ఆలోచింపజేసిన ఆవిష్కరణలు

- ఐఐటీహెచ్‌లో ముగిసిన మెగా టెక్నో ఫెయిర్
- మానవాళికి ఉపయోగపడనున్న అనేక ఆవిష్కరణలు
- ఐఐటీహెచ్, ఈ-స్పిన్ టెక్ సంస్థ మధ్య ఒప్పందం

ఇన్వెంటివ్-24 మెగా టెక్నో ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన విద్యార్థులు తదితరులు

సంగారెడ్డి, జనవరి 20(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఇన్వెంటివ్-24 మెగా టెక్నో ఫెయిర్‌లో అనేక ఆవిష్కరణలు వెలుగుచూశాయి. ఈ ఇన్వెంటివ్ 2024 మెగా టెక్నోఫెయిర్‌లో ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీలు ప్రదర్శించిన కొత్త ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. చివరిరోజు పారిశ్రామిక ప్రతినిధులతో పాటు వివిధ సాంకేతిక విద్యా సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు హాజరై ఆవిష్కరణలను తిలకించారు. శనివారం ఈ టెక్నోఫెయిర్ ముగిసింది. చివరి రోజు ఈ-స్పిన్ నానో టెక్నాలజీ సంస్థ ఐఐటీ హైదరాబాద్‌తో సాంకేతిక బదిలీ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఇంటర్నెట్ లేకుండా ఫోన్ ద్వారా సైన్స్ పాఠాలు సందేహాలు తీర్చుకోవడం, కృత్రిమ మేధను ఉపయోగించి గోదాముల్లో ధాన్యం నిల్వల పరిరక్షణ, ధ్వని తరంగాల ద్వారా శత్రదేశ డ్రోన్‌లను వెంటనే గుర్తించే యంత్రం, సెన్సార్ ద్వారా మొక్కల ఎదుగుదల తెలుసుకోవడం, రైతుల కోసం తేలికపాటి వ్యవసాయ పనిముట్లు, సైనికుల కోసం సూర్యశక్తి ఆధారంగా ఎన్‌సీఎఫ్ టెక్నాలజీతో హీటింగ్ పరికరాలను అభివృద్ధి వంటి ఆవిష్కరణలు చివరి రోజు ప్రదర్శింగా.. అందరినీ ఆకట్టుకున్నాయి.

ఇన్వెంటివ్-24 మెగా టెక్నో ఫెయిర్ వచ్చిన వివిధ యూనివర్సిటీల బృందాలు

రాములోరి దర్శనానికి స్పెషల్ రైళ్లు

ఈనెల 29 నుంచి మార్చి 3 వరకు సేవలు

పెద్దపల్లి, జనవరి 20(నమస్తే తెలంగాణ): ఈనెల 22న జరిగే అయోధ్య శ్రీరాముల వారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవానికి వెళ్లేందుకు రైల్వేశాఖ మన రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది.ఈనెల 29 నుంచి వచ్చే మార్చి 3వ తేదీ వరకు అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు సికింద్రాబాద్, ఖాజీపేట, జాల్నా నుంచి ఆస్థా స్పెషల్ సర్వీసులు నడపనున్నది.

సికింద్రాబాద్ జంక్షన్ పరిధిలో..

సికింద్రాబాద్ జంక్షన్ నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు రైలు నంబర్ (07221)ను నడుపనున్నారు. ఇది ఈనెల 29వ నుంచి ఫిబ్రవరి 29వ తేదీ మధ్య వారంలో మూడు రోజుల (మొత్తం 16ట్రిప్‌లు)పాటు నడుస్తుంది. ఇది జనవరి 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరుతుంది. మార్గమధ్యలో కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 6:20 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38కు, రామగుండానికి రాత్రి 8 గంటలకు వచ్చి, రెండురోజుల ప్రయాణం తర్వాత ఉదయం 3:30 గంటలకు అయోధ్యకు చేరుకుంటుంది. తిరిగి అయోధ్య నుంచి సికింద్రాబాద్ జంక్షన్ వరకు రైలు నంబర్ (07222) ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో, మార్చి 1, 3 తేదీల్లో నడుస్తుంది. ఇది అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుకుంటుంది. మార్గమధ్యలో రామగుండానికి సాయంత్రం 06:30, పెద్దపల్లి జంక్షన్‌కు 7కు, కాజీపేట జంక్షన్‌కు 8:08 గంటలకు చేరుకుంటుంది.

కాజీపేట జంక్షన్ పరిధిలో..

కాజీపేట నుంచి అయోధ్య ధాం జంక్షన్ రైల్వే స్టేషన్‌కు రైలు నంబర్ (07223) ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు వారంలో మూడు రోజులు (మొత్తం 15ట్రిప్‌లు) నడుస్తాయి. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో ఖాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 06:20 గంటలకు బయలుదేరుతుంది. పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38కు, రామగుండానికి 8 గంటలకు చేరుకుంటుంది. రెండు రోజుల ప్రయాణం తర్వాత ఉదయం 3:35 గంటలకు అయోధ్య జంక్షన్ చేరుకుంటుంది. అయోధ్య జంక్షన్ నుంచి కాజీపేట జంక్షన్‌కు రైలు నంబర్ (07224) ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో, మార్చి 2న (మొత్తం15 ట్రిప్‌లు) నడుస్తాయి. ఇది అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్ చేరుకుంటుంది.

జాల్నా నుంచి..

జాల్నా నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు (వయా పర్భని-పూర్ణా-నాందేడ్-నిజామాబాద్-కరీంనగర్-పెద్దపల్లి-బల్లార్షా మీదుగా) రైలు నంబర్ (07649) ఫిబ్రవరి 4న నడుస్తుంది.ఉదయం 09:30గంటలకు జాల్నా రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి బాసరకు మధ్యాహ్నం 3:15 గంటలకు, నిజామాబాద్‌కు సాయంత్రం 4 గంటలకు, కోరుట్లకు 5:18కు, లింగంపేట్ జగిత్యాలకు 5:50కు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు 6:45కు, పెద్దపల్లి జంక్షన్‌కి 7:35కు, రామగుండానికి 8గంటలకు చేరుకొని 6న ఉదయం 3:35 గంటలకు అయోధ్య చేరుకోనున్నది. ఇక అయోధ్య ధాం జంక్షన్ నుంచి జాల్నా వరకు రైలు నంబర్ (07650) ఫిబ్రవరి 6న నడుస్తుంది. అక్కడ మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు శుక్రవారం ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. మార్గమధ్యలో రామగుండానికి సాయంత్రం 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కి 7:55కు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కి రాత్రి 8:35కు, లింగంపేట్ జగిత్యాల రైల్వేస్టేషన్‌కు రాత్రి 9:20కు, కోరుట్లకు రాత్రి 9:50కు, నిజామాబాద్ జంక్షన్‌కి రాత్రి 11:10కు, బాసర రైల్వేస్టేషన్‌కు 11:53 గంటలకు చేరుకుంటుంది. మరుసటి రోజు 6గంటలకు జాల్నా రైల్వేస్టేషన్‌కి చేరుకుంటుంది. ఈ రైళ్లలో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2సాధారణ బోగీలు ఉంటాయి.

సాగునీరు అందించాలి


దౌల్తాబాద్ మండలం ఇందూప్రియాల్‌లో కొండపోచమ్మ కాల్వను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మాపై కోపంతో రైతుల పొట్ట కొట్టొద్దు

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్ మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు

రాయపోల్, జనవరి 20 : మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల ద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలంలోని ఇందూప్రియాల్‌లో శనివారం పలు కమ్యూనిటీ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న కాల్వలను పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్,కొండపోచమ్మ ప్రాజెక్టుల ద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని లక్షా 33 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎంపీపీ సంధ్యారవీందర్, జడ్పీటీసీ రణం జ్యోతి, వైస్ ఎంపీపీ అల్లి శేఖర్‌రెడ్డి, ఉమ్మడి మండల సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, సర్పంచ్‌లు శ్యామలాకుమార్, స్వప్నాజనార్దన్‌రెడ్డి, అయ్యగారి నర్సింహులు, తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

దౌల్తాబాద్ మండలం సురంపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి